ఈ కథ రాసే ముందు ఇందులోని పాత్రల గురించి సరైన అవగాహన పాఠకులకి కలగడం కోసం ఈ దిగువ వివరణలు ఇస్తున్నాను.

నేను: ఇంటి యజమానిని. అయితే, నా అధికారం నామ మాత్రం మాత్రమే. వాస్తవానికి ఇంట్లో పెత్తనమంతా చెలాయించేది మా ఆవిడే! నేను చేసే పనల్లా జరుగుతున్న తతంగానికి సాక్షిగా నిలవడమే!

మా ఆవిడ: దేశానికి ప్రధానమంత్రి ఎలాగో మా ఇంట్లో మా ఆవిడ అలాగ!

మా పెద్దబ్బాయి: రాష్ట్ర గవర్నర్ లాంటివాడు. అటు తల్లి ఆజ్ఞల్ని జవదాటలేక, ఇటు భార్య ఒత్తిడికి తట్టుకోలేక మధ్యన నలిగిపోతూంటాడు.

మా పెద్ద కోడలు: రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి హోదా ఈవిడది.

మా చిన్న కొడుకు: వీడు మరో రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి లాంటివాడు. వీడుకూడా అపోజిషన్ పార్టీవాడే. అయినా తల్లితో కలహించకుండా వ్యవహారం నెరువుకొస్తాడు. అదేమిటో! మా ఆవిడకూడా వీణ్ణి నమ్మినంతగా మరెవర్నీ నమ్మదు.

మా చిన్న కోడలు: ఈవిడ జాతీయ ప్రతిపక్ష పార్టీల నాయకురాలు లాంటిది! చాలా తెలివైనది కనక తన కెలాగూ అధికారం రాదని ముందే గ్రహించి తోటికోడల్ని ఎగదోస్తూ ఉంటుంది.

డాక్టర్ రామలక్ష్మి: మా వీధిలోనే ప్రాక్టీసు చేసుకుంటున్న డాక్టరు. ట్రీట్మెంటుకి మా ఆవిడ ఈవిడ దగ్గరకే వెళ్తూంటుంది. కె.బి.జి. ఏజెంటు లాంటిది ఈమె.

డాక్టర్ సుబ్బలక్ష్మి: ఈవిడకూడా మా వీధిలోనే డాక్టరుగా ప్రాక్టీసు చేసుకుంటున్నది. ఈవిడకీ, రామలక్ష్మికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. సి.ఐ.ఎ. ఏజెంటు లాంటిది ఈమె.

మా మనవలు: రాష్ట్ర ప్రజల్లాంటి వాళ్ళు. దేశ ప్రజల మన్న సంగతి రాష్ట్ర ప్రజ లెలాగైతే అప్పుడప్పుడు మర్చిపోతుంటారో... అలాగే వీళ్ళు కూడా ఒకే కుటుంబంలోని వాళ్ళ మన్న సంగతి అడపా దడపా మరిచిపోతూంటారు.

మేడపైని గది: మేడపైని గది అంటే ఒక్క గది మాత్రమే కాదు. ఆ గదితో బాటు ఒక బెడ్ రూమూ, ఒక కిచెనూ, ఒక బాత్రూమ్‌కూడా ఉన్నాయి. టూకీగా చెప్పాలంటే అదొక సెపరేట్ పోర్షన్! ఇంట్లో ఏమైనా శుభ కార్యాలు జరిగినప్పుడు కాని, వేసవిలో దిగువన ఉక్కగా ఉంటే పైకెళ్ళి పడుకుందికి కాని ఆ గదిని ఉపయోగిస్తుంటాం.

ఇక అసలు కథ చెబుతా వినండి.


నే నొక వ్యవసాయదారుణ్ణి. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న నాకు కులాసాగా జీవించడాని కని చెప్పి మా నాన్న ఓ పదెకరాల పొలం కొని, లంకంత ఇల్లుకూడా కట్టించి, కట్టించిన మరునాడే టపీమని గుండె పోటు వచ్చి మరణించాడు (స్వాతంత్ర్యానంతరం తుపాకీ గుళ్ళకి గాంధీ మహాత్ముడు బలైపోయిన విధంగా). మా నాన్న కి నే నొక్కణ్ణే సంతానం గనక ఆ స్థిరాస్తులకి సంబంధించిన వివాదా లేవీ రాలేదు. నేనూ, మా ఆవిడా ముప్పై ఏళ్ళు మా నాన్న కట్టించిన ఇంట్లోనే కాపరం చేశాం.

మా పెద్దబ్బాయికి పదేళ్ళ క్రితమే పెళ్ళయింది. వాడికి ఇద్దరు పిల్లలు. పెద్దవాడికి ఎనిమిదేళ్ళు. రెండోది ఆడపిల్ల. ఏడేళ్ళు. మళ్ళీ మా పెద్ద కోడలు ఈ మధ్యనే నెల తప్పింది. మా చిన్నబ్బాయికి కూడా ఎనిమిదేళ్ళ క్రితమే పెళ్ళయింది. వాడికికూడా ఇద్దరు చిన్న పిల్లలు. పెద్దవాడికి అయిదేళ్ళు. రెండో వాడికి నాలుగేళ్ళు.

ఇలా దేశ జనాభా పెరిగిపోయినట్టుగా ఈ పదేళ్ళలో మా ఇంట్లో జనాభాకూడా పెరిగిపోయింది. సహజంగానే సమస్యలు మొదలయ్యాయి.

నిజాని కివంత చెప్పుకోదగ్గ సమస్యలు కాకపోయినా, మే మప్పటివరకూ ఉన్న వాతావరణం దృష్ట్యా చూస్తే ఇవి చాలా పెద్ద జాతీయ సమస్యల్లాగే కనిపించాయి. కాబట్టి ఎంత నిగ్రహించుకుందా మనుకున్నా వీలుగాక అందరం ఈ సమస్యల్ని చాలా "సీరియ"స్‌గా పరిగణించసాగాం.

అసలు సమస్య ఇలా మొదలయింది. అప్పటి వరకూ మాది సమైక్య కుటుంబం. ఫస్టు తారీఖు రాగానే మా పిల్ల లిద్దరూ జీతం డబ్బులు పట్టుకొచ్చి వాళ్ళమ్మ చేతిలో పెట్టడం రివాజు. మొత్తం జమా ఖర్చులన్నీ ఆవిడ చేతిలోనే ఉండేవి. ఏ సందర్భంలో ఎంత ఖర్చు పెట్టాలో ఆవిడ నిర్ణయించేది. అయితే, ఈ పద్ధతి మా చిన్న కోడలికి అంత రుచించేది కాదు. కోడళ్ళిద్దరికీ ఇంటి యజమాయిషీలో భాగం ఇవ్వకుండా తానే సర్వాధికారిలా అత్తగారు ప్రవర్తించడం ఆమెకి చిరాకు కలిగిస్తూండేది.



మా పెద్ద కోడలు మట్టుకు పెళ్ళయి కాపురానికొచ్చిన పదేళ్ళ వరకూ ఇటువంటి విషయాల జోలికి పోలేదు. ఆమె అందంగా ఉండడమే కాకుండా బాగా పాడుతుందికూడా! మా వీధిలో ఎవరింట్లో ఏ ఫంక్షన్ జరిగినా ఈవిడ కచేరీ కంపల్సరీగా ఉండాల్సిందే! ఆ మాట కొస్తే మా ఆవిడకూడా బాగానే పాడుతుంది కాని, ఆవిడ గొంతు భక్తి గీతాలు వరకే పరిమితం. సినిమా పాటలు, లలిత సంగీతం ఆవిడకి రావు. ఈ కారణంగా గత ముప్పై ఏళ్ళలో మా ఆవిడ సంపాదించుకున్న పాప్యులారిటీ మా పెద్ద కోడలు వచ్చిన రెండు మూడేళ్ళకే సంపాదించుకుంది. పడుచు పిల్లలు, చిన్న పిల్లలు మా పెద్ద కోడలు సంగీత మంటే ఎగబడసాగారు. మా ఆవిడ కచేరీలకి కేవలం వయస్సు మళ్ళిన వృద్ధులు మాత్రమే హాజరయ్యేవారు.

మా పెద్ద కోడలికున్న ఈ ప్రత్యేకతని గుర్తించి ఇంటి విషయాల మీదకి ఆమె దృష్టిని మళ్ళించడానికి శతవిధాల ప్రయత్నించసాగింది మా చిన్న కోడలు. చివరి కందులో సఫలీకృతురాలైంది కూడా!

ఓ రోజు నేను హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటూండగా మా పెద్ద కోడలు వచ్చి దగ్గర్లో నిలబడింది. ఆమె అలా చాలా సేపు నించున్న తరవాత ఆమె ఏదో చెప్పడానికి వచ్చి సంశయిస్తున్నాదన్న సంగతి గ్రహించాను నేను. విషయ మేమిటని అడిగాను.

"మరేం లేదు, మామయ్యగారూ! దిగువన అందరం ఉంటూండడం వల్ల ఇల్లు ఇరుకైపోయింది. అదీకాక అందరికీ వండి వడ్డించడం అంటే అత్తయ్యకికూడా వయసుకి మించిన శ్రమ. అందుచేత మీ రనుమతి స్తే నేనూ, మా ఫామిలీ మేడపైని గదిలోకి మారదా మనుకుంటున్నాం."

విషయం విన్న నాకు చాలా ఆశ్చర్యం వేసింది-విశాలమైన ఇంటిని ఇరుగ్గా భావించిన మా కోడలి మనస్తత్వానికి. అయినా, ఇటువంటి విషయాల్లో తుది నిర్ణయం మా ఆవిడదే కాబట్టి నా




# మేడపైని గది (అనే గృహ రాజకీయం)

ఆర్వీ రమణ ప్రసాద్

ఆశ్చర్యాన్ని లోపల్లోపలే అణుచుకుంటూ మాఆవిణ్ణి పిలిచాను. "మన పెద్దబ్బాయి సంసారం మేడపైని గదిలోకి షిఫ్ట్ అయితే ఎలా ఉంటుందంటావ్?"

ఇటువంటి ప్రపోజల్ వినడం మాఆవిడక్కూడా అదే మొదటిసారి. ఆవిడ చెప్పకపోయినా, ఆవిడ మనస్సు ఇది వింటూనే కలవర పడిందని ఊహించగలిగాను నేను. అయినా, నిండు కుండ లాంటి వ్యక్తి కాబట్టి మొహంలో ఎటువంటి ఆందోళనా కనబడ నివ్వలేదు. "గోడౌన్‌లాంటి ఇల్లు దిగువ నుంటూంటే పై గదిలో కెళ్ళాల్సిన అవసరమేమొచ్చిందిట?" సూటిగా నన్నే ప్రశ్నించింది.

ఆవిడ కంఠానికి నేను భయపడ్డానేమో కాని, మా పెద్ద కోడలు మాత్రం కించిత్తుకూడా భయపళ్ళేదు. కాని, సమాధానం మాత్రం అత్తగారికి డైరెక్టుగా ఇవ్వలేదు.

"మే మేదో వేరు పడిపోతున్నట్టు బాధ పడిపోతారేంటి, మామయ్యగారూ! పిల్లలు దిగువున ఇరుకైపోయిం దంటున్నారు కదాని మేడపైని గదిలోకి మారదా మనుకుంటున్నాం. అయినా, మనవలు సుఖ పడాలనేగా ఆ మహాత్ముడు (మా నాన్నగారన్నమాట!) ఇంతిల్లు కట్టించిందీ?" అంది ఆవేశంగా.

"ఔనౌను. మనవలు సుఖపడాలనే ఆయనింతిల్లు కట్టించారు. ఆయన ఆశయ సిద్ధి కోసమైనా సరే మనం మేడపైని గదిలో ఉండక తప్పదు" అంది, అప్పుడే అక్కడి కొచ్చిన మా చిన్న కోడలు అక్కగారికి వంత పాడుతూ।

మా ఆవిడ తీవ్రంగా చిన్న కోడలి వంక చూసింది. ఆమె మొహం పక్కకి తిప్పేసుకుని, అత్తగారికి కనబడకుండా మూతి మూడు వంకర్లు తిప్పింది.

"వీల్లేదుగాక వీల్లేదు. నేను బతికుండగా ఈ ఇంట్లో రెండు పొయ్యిలు వెలిగించడమన్నది జరగదు" అంది మాఆవిడ కుండ బద్దలు కొట్టినట్లుగా.

మా పెద్ద కోడలూ, ఆమె వెనకే చిన్న కోడలూ వినవిన లాడుతూ వెళ్ళిపోయారు.

అప్పణ్ణించి మొదలయింది మా ఇంట్లో అంతర్యుద్ధం!

ఉన్నట్టుండి మామనవలందరూ చీటికీ మాటికీ నాయినమ్మ మీద కోపం ప్రదర్శించసాగారు-కూరలో ఉప్పు తక్కువైందనో, మజ్జిగ పలచనైందనో. ఇలా ఏదో ఒక నెపం పెట్టి, సగం సగం తింటున్న వాళ్ళు చేతులు కడిగేసుకోవడం లేదా అసలు

భోజనం చెయ్యడమే మానెయ్యడం మొదలు పెట్టారు.

మనవ లిలా పస్తులు పడుకోవడంతో మా ఆవిడ హృదయం తల్లడిల్లి పోయింది. అయినా ఆవిడ చాలా సూక్ష్మ దృష్టిగల వ్యక్తి. ఈ ఆందోళ నల వెనుక ఏదో హస్తం ఉందని గ్రహించిం దామె. చిన్న కొడుకుని పిలిచి కారణ మడిగింది.

"ఆ... మరేం లేదమ్మా. చదు వెక్కువైపోయి పిల్లలు నీర సించి పోతున్నారుట! మధ్యాహ్నం పూట ఒక కోడిగుడ్డు అయినా పెట్టందే వాళ్ళు తేరుకోలేరని వదినగారి అభిప్రాయం." చల్లగా అసలు విషయం చెప్పాడు మా చిన్నవాడు.

మా ఆవిడ ఇరకాటంలో పడింది.

మే మసలే శాకాహారులం. అప్పటివరకూ కోడుగుడ్డు లోప లేముంటుందో చూసి ఎరగం! అలాంటిది ఏకంగా కోడిగుడ్డే వండి పెట్టడమా?

కాని, అసలు సమస్యతో పోలి స్తే ఇదంత పెద్ద సమస్య కాదు. మాఆవిడ బాగా ఆలోచించుకుంది. ఆ రోజే బజారు కెళ్ళి ఓ డజను కోడిగుడ్లు కొనుక్కొచ్చింది. కోడిగుడ్లు చూడడంతోనే పిల్ల లందరూ సంబర పడుతూ ఎగబడ్డారు. ఆ దృశ్యం చూసిన మా పెద్ద కోడలు మొహంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు!

ఇలా ఈ పరి స్థితి రెండు రోజులు మాత్రమే సాగింది. మూ డో రోజునించీ మళ్ళీ యథా ప్రకారం పిల్లలు గొడవ చెయ్యసాగారు. ఒక పక్క కోడిగుడ్లు స్వాహా చే సేస్తూనే!

మా ఆవిడ మళ్ళీ చిన్నవాణ్ణి పిలిపించింది.

"ఊహూఁ...లాభం లేదమ్మా. మనం ఎంత చెప్పినా వినిపించుకునే స్థితిలో లేరు పిల్లలు. ఈ 'మధ్యాహ్నపు కోడిగుడ్డు పథకం' ముందుగా వాళ్ళమ్మ కొచ్చిన అయిడియాయేననీ, వాళ్ళమ్మని దెబ్బ కొట్టడానికే ను వ్వావిడని అనుసరిస్తున్నావనీ వదిన పిల్లల అభిప్రాయం. దీనికి మా పిల్లలు కూడా మద్దతు ప్రకటిస్తున్నారు." బోధ పరిచాడు మా చిన్నవాడు.

"అయితే, ఏం చేద్దాం?" మాఆవిడ అడిగింది నిరుత్సాహంగా.

"ప్రస్తుతానికి వాళ్ళని మేడపైని గదిలోకి పంపించెయ్యడమే ఉత్తమం. నాలుగు రోజు లెక్కి దిగే సరికి వాళ్ళకే ఆయాసం వచ్చి కిందకి దిగొస్తారు." సలహా ఇచ్చాడు మా వాడు.

మా వాడి సలహాకి తల ఒగ్గక తప్పలేదు మా ఆవిడకి.

మా పెద్దవాడి సంసారం మేడ పైని గదిలోకి వెళ్ళిపోయేందుకు సన్నాహాలు చకచకా జరిగిపోయాయి.

"మరి నీ మాటేమిటి?" అంది మాఆవిడ. చిన్న కోడలి వంక అనుమానంగా చూస్తూ.

"అబ్బే నే నెక్కడికీ వెళ్ళను." మాచిన్న కోడలు కొద్దిగా కంగారు పడింది. అంతలోనే తమాయించు కుంది. "నే నిక్కడే ఉంటాను. మాపిల్లలు మాత్రం పగటి పూట పైన భోజనం చేస్తారు. రాత్రిపూట ఇక్కడే భోజనం చేస్తాను. రాత్రి పడుకోవడం మాత్రం మేడమీద పడుకుంటాను-కొద్దిగా చల్లగా ఉంటుంది కదా" అంది. మళ్ళీ అత్తగా రేమను కుంటుందో నని.


మా ఆవిడేం మాట్లాడలేదు. "సరే నీ ఇష్టం" అంది నిర్లిప్తంగా.

గిన్నెల పంపకం దగ్గర కోడళ్ళిద్దరి మధ్య చిన్న చిన్న అభిప్రాయభేదా లొచ్చాయి. మంచి మంచి గిన్నెలన్నీ తోడికోడలు పట్టుకు పోతున్న దని వాపోయిందిమాచిన్న కోడలు. అయితే, అత్తగారి మీదున్న అక్కసుకొద్దీ ఈ విషయమై ఎక్కువ గొడవ చెయ్యలేదు.

కాపురాలు రెండూ వేరుపడ్డ రోజు మా ఆవిడ భోజనం చెయ్యలేదు. మనవలందరూ దూరమై పోయారన్న వ్యథతో ఆ రోజల్లా ఉదాసీనంగా ఉండిపోయింది.

** ** **

మేడమీదికి వెళ్ళిపోయిం తరవాత కాని అందులో ఇబ్బందేమిటో తెలిసి రాలేదు మా పెద్ద కోడలికి. ఆమె భర్త కొచ్చే ఆదాయం బహు స్వల్పం. అందులో సాధారణంగా నెల కయ్యే ఖర్చులు ఇమడాలంటేనే బహు కష్టం. మరి పిల్లల చదువులకీ, కోడిగుడ్లకీ అయ్యే ఖర్చు ఎక్కణ్ణించి వస్తుంది? మాటి మాటికీ కిందకి దిగి




వచ్చి అత్తగారి ముందు చేయి జాచాలంటే అభిమానం అడ్డొచ్చింది ఆమెకి. అయితే ఈ బాధ్యత నెత్తిన వేసుకుందికి మా చిన్న కోడలు రెడీగా ఉంది. వీలు చిక్కినప్పుడల్లా అత్తగారి దగ్గరి కొచ్చి తోడికోడలు పడుతున్న బాధలు ఏకరువు పెట్ట సాగిం దామె. అయితే, ఆమె ఆశించినంత ఆసక్తి మాత్రం మాఆవిడ ముఖంలో కనబడలేదు.

ఇలా ఉండగా మా పెద్ద కోడలికి ఏడు నెలలు నిండాయి. పుట్టింటికి ప్రయాణం కట్టిం దామె. ఈ విషయం చెప్పడ నికి అత్తగారి దగ్గరి కొచ్చినప్పుడు ఆవి డేం అభ్యంతర పెట్టలేదు సరికదా-వెయ్యి రూపాయలుకూడా ఇచ్చి సాగనంపింది కోడల్ని.

పుట్టింటి కెళ్ళిన పది రోజులకల్లా మా పెద్ద కోడల్దగ్గర్నుంచి మా పెద్ద వాడికి ఘాటైన ఉత్తరం వచ్చింది-

"మూ డో కాన్పుని కూడా ఆలోచించకుండా పుట్టింటికి తరిమేశారు నన్ను. మావాళ్ళు మాత్రం ఎన్ని సార్లు భరించగలరు? మీ అమ్మ ఇచ్చిన వెయ్యి రూపాయలు నా టానిక్కులకికూడా సరిపోవటం లేదు. ఇంక ఆస్పత్రికీ, మంత్రసానికీ ఇవ్వాల్సిన డబ్బులు ఎక్కణ్ణించి వస్తాయి? వెంటనే మీ అమ్మ నడిగి మరో రెండు వేలు పంపండి."

మాపెద్దవాడు వినయంగా ఆ ఉత్తరాన్ని తల్లికి అందించాడు.

చదివి అగ్గిమీద గుగ్గిలం అయిం దావిడ. "వీల్లేదు. వెయ్యి రూపాయలకన్నా పైసాకూడా ఎక్కు విచ్చేది లేదు! ప్రతిసారీ వెయ్యి రూపాయలే ఇస్తున్నాను నేను. చిన్న కోడలికికూడా అలానే ఇచ్చాను. అప్పుడు సరిపోగా లేంది ఇప్పుడు చాలదా? అయినా, తనంతట తాను పుట్టింటికి ప్రయాణ మయిందే కాని, నే నిక్కడ పురుడు పొయ్యనన్నానా?" అంటూ మా పెద్దవాడి మీద గయ్‌మని లేచింది.

వాడు మొహం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు. వా ణ్ణటు వెళ్ళనిచ్చి మా ఆవిడ డాక్టర్ రామలక్ష్మి దగ్గరి కెళ్ళింది-బి.పి. చెక్ చేయించుకోవడానికి.

మాది పెద్ద సంసార మేమో డాక్టర్ రామలక్ష్మికీ, డాక్టర్ సుబ్బలక్ష్మికీ నెలకి చెరొక వంద రూపాయలైనా ఫీజుగా ముడుతూంటుంది. సుబ్బలక్ష్మి లేకపోతే బిజినెస్సంతా తనకే వచ్చును కదాని రామలక్ష్మీ, రామలక్ష్మి లేకపోతే అంతా తనకే వచ్చేసును కదాని సుబ్బలక్ష్మీ...ఇలా ఇద్దరూ వాపోతూంటారు. మా ఇంట్లో కలతలు ప్రారంభమైనప్పటినుంచీ ఆ అవకాశాన్ని వినియోగించుకుని ఒకర్నొకరు దెబ్బ తియ్యాలని ప్రయత్నించసాగారు.

"మీ కోడలి డెలివరీకి సుబ్బలక్ష్మిని పంపించారటగా?" అంది బి. పి. చూస్తున్న రామలక్ష్మి యాథాలాపంగా.

మా ఆవిడకేం అర్థం కాలేదు. "ఏమిటి మీరంటున్నది?" అని తిరిగి ఆమెనే ప్రశ్నించింది.

"అదేమిటి...మీకు తెలీనే తెలీదా? వీధి వీధంతా చెప్పుకుంటూంటే మీరే పంపించా రేమో నని అనుకున్నాను" అంది ఆశ్చర్యం నటిస్తూ.

మా ఆవిడ ఇక సంభాళించుకోలేకపోయింది. "నాకు తెలీకుండా ఈ మధ్య చాలా జరిగి పోతునయి లెండి. అందుకే కాబోలు మరో రెండు వేలు నన్నడిగి పంపమని మా వాడికి ఉత్తరంకూడా

రాసింది మా కోడలు."

రెండు వేలనే మాట వినేసరికల్లా రామలక్ష్మికి తేలు కుట్టినంత బాధ కలిగింది.ఆ బాధంతా ఆమె సుబ్బలక్ష్మి మీద వెళ్ళగక్కింది. "మీ కోడలు పిలిచిందే అనుకోండి. ఈవిడకి బుద్ధుండక్కర్లా? ఆ ఊళ్లో డాక్టర్లు దొరకరనా ఏమిటి...తగుదునమ్మా అని తనుకూడా బయల్దేరింది. నా మాట విని మీరిప్పుడే మీ కోడల్ని అదుపులో పెట్టండి. లేకపోతే ఇలాగే విచ్చలవిడిగా డబ్బంతా తగలేసి ఆనక డబ్బా బోర్లించేస్తుంది. అసలే మీది పెద్ద కుటుంబం కూడాను" అని సానుభూతి ఒలకబోస్తూ గట్టిగా చీవాట్లుకూడా పెట్టింది. ఆ తరవాత బి. పి. చాలా ఎక్కువగా ఉందనీ, ఓ నెల రోజులపాటు క్రమం తప్పకుండా ట్రీట్‌మెంటుకి రావలసిందనీ మాఆవిణ్ణి పదే పదే హెచ్చరించి మరీ పంపింది.

సీరియస్‌గా ఇంటి కొచ్చేసింది మా ఆవిడ. వెంటనే చిన్నవాణ్ణి పిలిచి రామలక్ష్మి చెప్పిన వన్నీ చెప్పింది. చెప్పి, ఈ సమస్యకి ఏదో పరిష్కారం ఆలోచించమని వాణ్ణి కోరింది.

మాచిన్నవాడు వెంటనే పరిష్కారం సూచించలేదు. ఇది చాలా సున్నితమైన విషయమనీ, తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దనీ, బాగా ఆలోచించి దీనికి సరైన పరిష్కారం తానే చెబుతాననీ తల్లికి వాగ్దానం చేశాడు.

అన్నట్టుగానే నెల రోజులపాటు సీరియస్‌గా ఆలోచించాడుకూడా!

వాడలా ఆలోచిస్తూండగానే మాపెద్ద కోడలికి డెలివరీ అయిపోవడం, మరో అబ్బాయి పుట్టడంకూడా జరిగిపోయింది. ఇంక మర్నాడు ఆమె వచ్చేస్తుందనగా మావాడి కో బ్రహ్మాండమైన అయిడియా వెలిగింది.

"అమ్మా! ఇదే అదను...అన్నయ్యతో చెప్పి పైనున్న సామానంతా కిందకి వచ్చేటట్లు చెయ్యి. వదిన వచ్చేసరికల్లా ఈ ఏర్పాట్లన్నీ జరిగిపోవాలి. ఎలాగూ చంటివాడితో వస్తున్నది గనక ఆమెకూడా ఈ ఏర్పాటుని గట్టిగా వ్యతిరేకించలేదు." నెల రోజులాలోచించి మా చిన్న వాడిచ్చిన సలహా ఇది.

మాఆవిడకి మాత్రం ఈ సలహా బాగా నచ్చింది. వెంటనే పెద్దవాణ్ణి పిలిచింది.

క్షణాలమీద వ్యవహారం గప్‌చిప్‌గా జరిగిపోయింది. మేడమీద గదిలోంచీ గిన్నెలు, మంచాలు అన్నీ మళ్ళీ కిందకి వచ్చేశాయి.

అంతా గమనిస్తోంది మాచిన్న కోడలు. మర్నాడుదయం భార్యని రిసీవ్ చేసుకుందికి మా పెద్దవాడు స్టేషను కెళ్ళగానే చడీ చప్పుడూ లేకుండా ఇంట్లోంచి జారుకుంది.అలా జారుకున్నది తిన్నగా సుబ్బలక్ష్మి దగ్గరి కెళ్ళి ఈ గుట్టంతా చెప్పేసింది.

ఆవిడకూడా ఆలస్యం చెయ్యకుండా ఆటో కట్టించుకుని స్టేషన్ కెళ్ళి, రైలు దిగిన మా పెద్ద కోడల్ని అమాంతం కావలించుకుని పక్కకి లాక్కుపోయి (మాపెద్దవాడు వినకుండా) విషయమంతా ఊదేసింది. "నువ్వు పచ్చి బాలింతరాలి వన్న ఇంగితజ్ఞానం కూడా లేకుండా మీ అత్తగారు ఇంటి చాకిరీ నీ నెత్తిమీద రుద్దుదా మనుకుంటున్నారు. నీ శ్రేయోభిలాషిని కాబట్టి ఉండబట్టలేక స్టేషను కొచ్చి మరీ చెబుతున్నాను. నీ కాపురాన్ని ఎలా దిద్దుకుంటావో, ఏమో!" అంటూ భోరున ఏడ్చేసిందికూడా! ఆవిడ కంత ఏడుపు రావడానికి కారణం మా కోడలి పట్ల సానుభూతి మాత్రం కాదు. గత నెల రోజులుగా మా ఆవిడ బి.పి. ట్రీట్‌మెంటు కని చెప్పి డాక్టర్ రామలక్ష్మి వెయ్యి రూపాయలు ఫీజు తీసుకుందన్న నీలివార్త వచ్చినప్పటినుంచీ వస్తున్న దుఃఖాన్ని ఆపుకోవాలని ఆమె చేస్తున్న ప్రయత్నం ఆ రోజు విఫలమైంది. అంతే!

మాకోడలి హృదయంలో అగ్ని పర్వతం బద్దలైంది!

"మేడ పైని గదిని ఖాళీ చేసేశారుటగా?" భర్తని నిలదీసింది ఆటోలో కూర్చోగానే.

"అవును" అన్నాడు మా వాడు భయం భయంగా.

"మీ రింటికి వెళ్ళండి. నేనూ, పిల్లలూ హొటలోకెళ్ళి పోతున్నాం" అని భర్తని ఆటోలోంచి దింపేసి, ఆటోని నేరుగా హొటల్‌కి పోనిమ్మని హుకుం జారీ చేసిందామె!

మొహం వేలాడేసుకుని ఇంటికి వచ్చాడు మా పెద్దవాడు.

"నువ్వా హొటల్ పక్కకి వెళ్ళకు. డబ్బులైపోతేవారం లోగా అదే ఇంటి కొచ్చేస్తుంది." విషయమంతా సావధానంగా విన్న మా ఆవిడ కొడుక్కి భరోసా ఇచ్చింది.

వారం రోజులు గడిచాయి.

మాపెద్ద కోడలు ఇంటికి రాలేదు. ఈ లోగా మా చిన్న కోడలు మావీధిలో ఉన్న ఆడవడుచుల్ని, చిన్న పిల్లల్ని చేరదీసి తోడికోడలికి కావలసినంత సంపతీ సంపాదించి పెట్టింది. చివరికి మా ఆవిడ స్నేహితులుకూడా-'పోనీలే, అమ్మా! వాళ్ళు మానాన వాళ్ళని మేడపైని గదిలోనే ఉండనీయకూడదా?' అనేవరకు వచ్చింది పరిస్థితి.

మా ఆవిడ అన్నీ విని మౌనం వహించేది. ఎవరికీ ఏ సమాధాన మిచ్చేది కాదు. ఆమె మనసులో ఏముందో ఎవరికీ అంతు బట్టలేదు.

పది రోజులు గడిచాయి.

మావీధిలో ఉద్రిక్తత పెరిగిపోయింది. కోడల్ని ఇంటికి రానివ్వకుండా అత్తగారు వేధిస్తున్నాదని ఒక వర్గం వారు వాదిస్తే, అత్తగార్ని ధిక్కరించినందుకు కోడలి కిదే సరైన శిక్ష అనీ మరో వర్గం వాదించసాగింది. మా చిన్న కోడలు మాత్రం అందరి ఇళ్ళకీ వెళ్ళి యథాశక్తి చందాలు వసూలు చేసి, తోడికోడలు ఉంటున్న హొటల్‌కి బిల్లులు చెల్లించసాగింది. డాక్టర్ సుబ్బలక్ష్మి కూడా రోజూ ఆటోలో హొటల్‌కి వెళ్ళి మందులూ, మాకులూ ఇచ్చి మా కోడలి ఆరోగ్యం దెబ్బతినకుండా కాపాడుకొస్తున్నాది.

పదిహేను రోజులు గడిచాయి.

మా పెద్ద కోడలు ఇంటికి రాలేదు.

ఉన్నట్టుండి ఏ మాలోచించుకుందో ఏమో...మా పెద్దవాణ్ణి పిలిచింది మాఆవిడ. "ఇలా పెళ్ళాన్ని అదుపులో పెట్టలేని వాడివి ఏం బాగుపడతావురా?" అని చీవాట్లేసింది.

ఏడుపు ముఖం పెట్టేశాడు వాడు.

"స్వతహాగా దాని గుణం మంచిదే నమ్మా. కాని, ఇదిగో నీ మనవ లున్నారే...వీళ్ళు దేవాంతకులు. వీళ్ళు చేస్తున్న గొడవ భరించలేక అదికూడా అలా ప్రవర్తిస్తున్నాది." నసుగుతూ పెళ్ళాం పక్కనే మొగ్గు చూపించాడు వాడుకూడా.

మరోమారు కిందికి దిగిరాక తప్పలేదు మా ఆవిడకి.

మా పెద్దకోడలి సంసారమంతా తిరిగి మేడ పైని గదిలోకి చేరుకుంది. మా పెద్ద కోడలు ఇంటికి చేరుకుంది.

మాఆవిడ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మావీధి వీధంతా హర్షించింది. అలా హర్షించడానికి వచ్చిన వారిలో కొంతమంది వెళ్తున్నప్పుడు మేడ మీదికి కూడా వెళ్ళి, పట్టుదలతో వ్యవహరించినందుకు మా పెద్ద కోడల్నికూడా ప్రత్యేకంగా అభినందించి మరీ వెళ్ళారు.

కాని ఈ సంఘటన తరవాత నైరాశ్యపు మేఘాలు మా ఆవిడ మనస్సుని పూర్తిగా కమ్మేశాయి.

"ఇక నా చేతిలో ఏమీ లేదు. ఈ కుటుంబాన్ని కలిసి కట్టుగా ఉంచడానికి నా శాయశక్తులా కృషి చేశాను. కలిసి కట్టుగా ఉంటే కొన్ని ఖర్చులు కలిసొస్తాయి. విశాలమైన ఇంట్లో యథేచ్ఛగా తిరగొచ్చని నా ఆశ. కాని, ఎవరి అభిరుచులు వాళ్ళవి. కనీసం నేను చనిపోయిన తర్వాతైనా వీళ్ళందరూ కలిస్తే నా ఆత్మ సంతోషిస్తుంది" అంటూ తనలో తాను గొణుక్కుంది.

నే నామెని ఓదార్చాను. మరేం ఫర్వాలేదని, త్వరలో పరిస్థితులు చక్కబడతాయనీ ఆమెకి ధైర్యం చెప్పాను.

కాని...

ఎవరూ ఊహించని విధంగా ఆ రాత్రే ఒక విషాద సంఘటన జరిగిపోయింది! మా మనవడొకడు ఆకతాయితనానికి బాత్రూమ్‌లో అడ్డుగా వదిలేసిన బాల్చీ తన్నేసుకుని కిందపడిపోయిం దావిడ. ఆ పడిపోవడంతో ఆమె వెన్నుబద్దీ విరిగిపోయింది.

హాస్పటల్లో చేర్పించాం!

నిద్రాహారాలు మాని మా కోడళ్ళిద్దరూ ఆమెకి సేవ చేశారు. కాని.ఫలితం లేకపోయింది.

ఇరవైనాల్గు గంటలు హాస్పటల్లో నరకయాతన అనుభవించి, శాశ్వతంగా ఈ లోకం నుంచి సెలవు తీసుకుం దామె!

మాకు జీవితాలే శూన్యమైపోయాయి.

గుండెలు పగిలేలా రోదించాం అందరం! యాంత్రికంగా కర్మకాండ పూర్తయింది. అందరం ఇంటికి వచ్చాం. ఇల్లంతా శ్మశాన నిశ్శబ్దం ఆవహించింది. ఆవిడ బతికున్న రోజుల్లో ఎప్పుడూ హుందాగా, నిండుగా కళకళ లాడుతూ ఉండే ఇల్లు అది!

అందరం దిగులుగా ఎవరి గదుల్లోకి వాళ్ళం దారి తీశాం.

×× ×× ××

మర్నాడుదయం హాల్లోకి వచ్చిన నేను నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను.

ఇల్లంతా సందడిగా పెళ్ళివారిల్లులా ఉంది. మేడపైని గదిలోని సామానంతా ఒక్కొక్కటే కిందకి చేర వేస్తున్నారు-మాకోడళ్ళూ, కొడుకులూ, మనవలూ. అందరూ!

"మమ్మల్ని క్షమించండి, మామయ్యగారూ! అత్తయ్య మనసుని అర్థం చేసుకోకుండా దురుసుగా ప్రవర్తించాం. ఆవిడ ఆశయానికి అనుగుణంగా ఇకమీదట అందరం కలిసి మెలిసి ఉండాలని నిర్ణయించుకున్నాం." నిశ్చేష్టుడై నిలుచున్న నా దగ్గర కొచ్చి తల వంచుకుని చెప్పింది మా పెద్ద కోడలు.

ఈ మాట లంటున్నప్పుడు ఆమె కంఠం రుద్ధమవడం గమనించాను నేను.

నాక్కూడా అనుకోకుండా కళ్ళు చెమర్చాయి.

కుటుంబాన్ని సమైక్యంగా ఉంచడానికి మా కోడలు చేస్తున్న ప్రయత్నం పట్ల ముగ్ధుడనై మనసులోనే ఆమెని అభినందించాను.

మాఇంట్లో గృహ రాజకీయానికి తెర పడింది.★